






RNI NO: APTEL/2014/5832

# నవతరం

తెలుగు దిన పత్రిక

ఎడిషన్ ఇంచార్జ్: నవచైతన్య శిరిగిరి

సంపుటి: 13, సంచిక: 262, 30-09-2026 బుధవారం వెల:1/- పేజీలు: 4

శ్రీకాకుళం - విజయనగరం - విశాఖపట్నం - రాజమండ్రి


## బఫర్‌జోన్‌లో బరితెగింపు.. అధికారులపైనే దౌర్జన్యమా!

**అరసవల్లి వెర్రిగెడ్డపై నిర్మాణాల దూకుడు**

**బఫర్‌జోన్‌లో అనుమతులపై అనుమానాలు**

**ఫిర్యాదులు వెల్లువెత్తినా.. స్పందన ఎక్కడ?**

**"ఉద్యోగాలు పీకిస్తా.. కోర్టుల చుట్టూ తిప్పుతా" అంటూ హెచ్చరికలా?**

**ఫిర్యాదు చేసిన రైతులపైనే బైండోవర్ చర్యలు**

**కలెక్టర్ గ్రీవెన్స్‌కు వెళ్లినా.. పరిష్కారం కనిపించేదెప్పుడు?**

**సర్వే నంబర్లు, భూ హద్దులు, బఫర్‌జోన్‌పై సమగ్ర సర్వేకు డిమాండ్**

**(నవతరం ప్రతినిధి -శ్రీకాకుళం)**

శ్రీకాకుళం నగర పరిధిలోని అరసవల్లి తోట జంక్షన్ సమీపంలో ఉన్న వెర్రిగెడ్డ బఫర్‌జోన్ పరిధిలో నిర్మాణాల వ్యవహారం వివాదాస్పదంగా మారుతోంది. గెడ్డ పరిధి, బఫర్‌జోన్ హద్దులు, నిర్మాణానికి ఉన్న అనుమతులు, వాస్తవ భూ విస్తీర్ణం, సర్వే నంబర్లపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. తమ భూములు, గెడ్డ పరిధి, నీటి ప్రవాహానికి సంబంధించిన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్మాణాలు జరుగుతున్నాయంటూ రైతులు గతంలో పలుమార్లు ఫిర్యాదులు చేసినట్లు చెబుతున్నారు. ఇటీవల సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలోనూ ఈ అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఫిర్యాదుల నేపథ్యంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లగా.. అక్కడ నిర్మాణదారుడి నుంచి అధికారులపైనే తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమైనట్లు రైతులు ఆరోపిస్తున్నారు. అధికారుల విధులకు ఆటంకం కలిగించేలా వ్యవహరించడంతో పాటు "ఉద్యోగాలు పీకిస్తా.. కోర్టుల చుట్టూ తిప్పుతా" అంటూ హెచ్చరించినట్లు వారు చెబుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత నిర్మాణదారుడి అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది. మరోవైపు సమస్యపై ఫిర్యాదు చేసిన రైతులపైనే బైండోవర్ చర్యలు తీసుకున్నారనే విషయం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. తమ సమస్యపై అధికారులను ఆశ్రయించిన తమపైనే చర్యలు ఎందుకు తీసుకున్నారంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. కలెక్టర్ గ్రీవెన్స్ వరకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించకపోగా.. ఫిర్యాదుదారులపై బైండోవర్ చర్యలు తీసుకోవడం తమకు తీవ్ర ఆవేదన కలిగిస్తోందని వారు పేర్కొంటున్నారు.

వెర్రిగెడ్డ బఫర్‌జోన్ పరిధి ఎంత? సంబంధిత సర్వే నంబర్లలో వాస్తవ భూ విస్తీర్ణం ఎంత? నిర్మాణానికి ఇచ్చిన అనుమతులు ఏ మేరకు వర్తిస్తాయి? అనుమతులు ఉన్న ప్రాంతానికే నిర్మాణాలు పరిమితమయ్యాయా? గెడ్డ, నీటి ప్రవాహ మార్గం, బఫర్‌జోన్ హద్దులు దాటాయా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ముఖ్యంగా సర్వే రికార్డులు, రెవెన్యూ మ్యాపులు, మున్సిపల్ అనుమతులు, క్షేత్రస్థాయి పరిస్థితులను సరిపోల్చి పరిశీలిస్తేనే వాస్తవ పరిస్థితి వెలుగులోకి వస్తుందని రైతులు చెబుతున్నారు. నిర్మాణాల విషయంలో తమకు రాజకీయ అండ ఉందంటూ కొందరు స్థానికులు ఆరోపణలు చేస్తున్నప్పటికీ.. దీనిపై అధికారికంగా ధ్రువీకరణ కావాల్సి ఉంది. ఆరోపణలు, ప్రత్యారోపణల మధ్య అసలు వాస్తవం ఏమిటో తేల్చాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఈ నేపథ్యంలో ఇరిగేషన్ , రెవెన్యూ, మున్సిపల్, సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి బఫర్‌జోన్ హద్దులు, సర్వే నంబర్లు, భూ విస్తీర్ణం, నిర్మాణ అనుమతులు, వాస్తవ నిర్మాణ పరిస్థితిని పరిశీలించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఫిర్యాదు చేసిన వారిపై చర్యలు తీసుకోవడం కంటే ముందుగా ఫిర్యాదులోని అంశాలపై పారదర్శకంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని వారు కోరుతున్నారు. వెర్రిగెడ్డ బఫర్‌జోన్ విషయంలో నిబంధనలు ఉల్లంఘించబడ్డాయా.. లేక అన్ని అనుమతులతోనే నిర్మాణాలు జరుగుతున్నాయా అన్నది అధికారుల సమగ్ర పరిశీలనతో తేలాల్సి ఉంది.

## నియోజకవర్గ సమస్యలపై కలెక్టర్‌తో విప్ అశోక్ భేటీ

నవతరం శ్రీకాకుళం, సెప్టెంబర్ 29: ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ మంగళవారం శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో భేటీ అయ్యారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమావేశంలో నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అంశాలపై వారిద్దరూ సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా బారువా సామాజిక ఆరోగ్య కేంద్రం (సిహెచ్‌సి) ప్రాంగణంతో పాటు సోంపేట డయాలసిస్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ సదుపాయం లేక రోగులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను విప్ అశోక్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ



అత్యవసరంగా డ్రైనేజీ వ్యవస్థను పునర్నిర్మించాలని, నిలిచిపోతున్న మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

ఎమ్మెల్యే విన్నవించిన సమస్యలపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ సానుకూలంగా స్పందించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, అవసరమైన నిధులు మంజూరుతో పాటు తగిన చర్యలు త్వరితగతిన తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇచ్చారు.

## గిరిజన అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలి

**అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాలి: ఎమ్మెల్యే కూన రవికుమార్**

నవతరం, సీతంపేట, సెప్టెంబరు 29: గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన 78వ పాలకవర్గ సమావేశంలో ఆయన పాల్గొని గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలో ఐటీడీఏ ద్వారా గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలపై పాలకవర్గ సభ్యులతో చర్చించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, సాగునీరు, వ్యవసాయం, మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. గిరిజన గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచాలని ఎమ్మెల్యే సూచించారు. అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కూన రవికుమార్ సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, క్షేత్రస్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాలని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు స్వయంగా గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో శాఖల మధ్య సమన్వయం మరింత పెంచుకోవాలని సూచించారు. సమావేశంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, శ్రీకాకుళం, పార్వతీపురం జిల్లాల కలెక్టర్లు, పలాస, పాతపట్నం, పాలకొండ ఎమ్మెల్యేలు, ఐటీడీఏ పాలకవర్గ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



**యువత ఆలోచిస్తే.. దేశం ముందుకు సాగుతుంది**

**చేతిలో సెల్‌ఫోన్ కాదు.. భవిష్యత్తుపై బాధ్యత ఉండాలి**

**ప్రతి విద్యార్థి ఓ కథ.. చివరి పేజీ మీ చేతుల్లోనే**

**విలువలతో ఎదిగితే.. సమాజానికి దిశ చూపొచ్చు**

**ఆసక్తులను వ్యసనాలుగా కాదు.. విజయానికి ఆయుధాలుగా మలచాలి**

**ఉద్యోగం కోసం కాదు.. సమాజ నిర్మాణం కోసం ఎదగాలి: గ్లోబల్ ప్రసాద్**

## యువతే మార్పునకు తొలి అడుగు..



**(నవతరం ప్రతినిధి -శ్రీకాకుళం)**

**"యువత మారితేనే సమాజం మారుతుంది.. యువత ఆలోచిస్తేనే దేశం ముందుకు సాగుతుంది." నేటి యువత ఏం ఆలోచిస్తోంది? వారి ఆసక్తులు ఏ దిశలో సాగుతున్నాయి? వారికి ఆదర్శంగా నిలుస్తున్న అంశాలేమిటి? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతుకుతూ గ్లోబల్ ప్రసాద్ చేసిన ప్రసంగం విద్యార్థుల్లో కొత్త ఆలోచనలకు నాంది పలికింది. యువతలోని శక్తిని గుర్తించి, దానికి సరైన దిశను చూపితే సమాజంలో సానుకూల మార్పు సాధ్యమని ఆయన వివరించారు.**

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన "నేటి యువత ఆసక్తులు.. ఆలోచనలు.. ఆదర్శాలు ఏమిటి?" అనే సదస్సులో గ్లోబల్ ప్రసాద్ మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తు కేవలం చదువు, ఉద్యోగానికే పరిమితం కాకూడదని.. వ్యక్తిగత ఎదుగుదలతో పాటు సమాజం పట్ల బాధ్యతను కూడా అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

***యువత అంటే ఒక శక్తి..***

"యువత అంటే కేవలం ఒక వయస్సు కాదు.. అది అపారమైన శక్తి. ఆ శక్తికి సరైన దిశ చూపగలిగితే భారతదేశ భవిష్యత్తు అద్భుతంగా మారుతుంది" అని గ్లోబల్ ప్రసాద్ అన్నారు. యువత చేతిలో ఉన్న ప్రతి సాధనం ఎలా ఉపయోగించబడుతుందన్నదే వారి భవిష్యత్తును నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. "నేటి యువత చేతిలో సెల్‌ఫోన్ మాత్రమే లేదు.. ఒక కుటుంబం ఆశ ఉంది.. ఒక సమాజం భవిష్యత్తు ఉంది.. ఒక దేశం రేపటి రూపం ఉంది" అంటూ యువత తమ బాధ్యతను గుర్తించాలని సూచించారు.

***చదువుతో పాటు ఆలోచన..***

విద్యార్థుల భవిష్యత్తును కేవలం మార్కులు నిర్ణయించవని గ్లోబల్ ప్రసాద్ అన్నారు. "మీరు ఈరోజు ఏం చదువుతున్నారన్నదానికంటే.. ఏం ఆలోచిస్తున్నారు అనేదే మీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. మీ ఆలోచనలు ఉన్నతంగా ఉంటే.. మీ అడుగులు కూడా ఉన్నతమైన గమ్యాన్ని చేరుకుంటాయి" అని చెప్పారు. ఎవరో ఒకరు తమ భవిష్యత్తును నిర్మించి ఇస్తారని ఎదురుచూడకుండా.. తమ భవిష్యత్తును తామే నిర్మించుకోవాలని విద్యార్థులకు సూచించారు. తమలోని ప్రతిభను గుర్తించడంతో పాటు తమపై తమకు నమ్మకం పెంచుకోవాలని అన్నారు.

***ప్రతి విద్యార్థి ఓ కథ..***

"ప్రతి విద్యార్థి ఒక పుస్తకం కాదు.. ఒక పూర్తి కథ. ఆ కథలో చివరి పేజీ ఇంకా రాయబడలేదు. ఆ చివరి పేజీని మీ కష్టం.. మీ క్రమశిక్షణ.. మీ ఆలోచనలు రాయాలి" అని గ్లోబల్ ప్రసాద్ విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. విజయం ఒక్కరోజులో రాదని.. చిన్నచిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని నిరంతరం కృషి చేస్తేనే గమ్యాన్ని చేరుకోగలమని వివరించారు. వైఫల్యాలను చూసి వెనక్కి తగ్గకుండా వాటి నుంచి పాఠాలు నేర్చుకుని ముందుకు సాగాలని సూచించారు.

***ఆసక్తి.. వ్యసనం కాకూడదు***

నేటి యువతలో ఆసక్తులు వేగంగా మారుతున్నాయని పేర్కొన్న గ్లోబల్ ప్రసాద్.. వాటిని సరైన మార్గంలో ఉపయోగించుకోవాలని సూచించారు. "యువత తమ ఆసక్తులను వ్యసనాలుగా మార్చుకోకూడదు.. తమ **(మిగతా 2వ పేజీలో)**

నవతరం
తెలుగు దిన పత్రిక

# యువతే మార్పుకు తొలి అడుగు

(మొదటిపేజీ తరువాయి)

ఆసక్తులనే భవిష్యత్తుకు ఆయుధాలుగా మార్చుకోవాలి" అన్నారు. లక్ష్యం లేని యువతకు గమ్యం ఉండదని, ఆదర్శాలు లేని యువతకు దిశ ఉండదని చెప్పారు. విలువలను జీవితంలో భాగం చేసుకున్న యువత మాత్రమే సమాజంలో శాశ్వతమైన మార్పును తీసుకురాగలదని వివరించారు.

**విజయానికి మరో అర్థం..**

"ఒక విద్యార్థి విజయం అతని కుటుంబానికి ఆనందం. కానీ ఒక విద్యార్థి తన విజయాన్ని సమాజం కోసం ఉపయోగించినప్పుడు.. అదే నిజమైన విజయం" అని గ్లోబల్ ప్రసాద్ అన్నారు. తల్లిదండ్రులు తమపై ఉంచిన నమ్మకాన్ని విద్యార్థులు నిలబెట్టుకోవాలని, ఉపాధ్యాయులు తమపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలని కోరారు. దేశం తమపై ఉంచిన భవిష్యత్తు బాధ్యతను కూడా యువత గుర్తించాలని పిలుపునిచ్చారు.

**మార్పు మీతోనే మొదలు..**

"నేటి యువతను మనం కేవలం ఉద్యోగాల కోసం తయారు చేయకూడదు.. సమాజాన్ని నిర్మించే నాయకులుగా తీర్చిదిద్దాలి. ఎందుకంటే రేపటి భారతదేశం మీ చేతుల్లో ఉంటుంది" అని గ్లోబల్ ప్రసాద్ అన్నారు. చివరగా విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతూ.. "మీరు మారితే మీ కుటుంబం మారుతుంది.. మీ కుటుంబం మారితే సమాజం మారుతుంది.. సమాజం మారితే భారతదేశం మారుతుంది. అందుకే మార్పు కోసం ఎదురుచూడకండి.. మీరే మార్పుకు తొలి అడుగు వేయండి" అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు ఆదర్శ్, రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్, రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్, జిల్లా అధ్యక్షుడు చందు, జిల్లా కార్యదర్శి ఖాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## అరసవల్లి అభివృద్ధికి రూ.55.74 కోట్లు : స్వదేశ్ దర్శన్ 2.0 కింద నిధుల మంజూరు: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

నవతరం శ్రీకాకుళం, సెప్టెంబర్ 29 : అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి దేవస్థానం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద రూ.55.74 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. అరసవల్లి కేవలం ఆలయం మాత్రమే కాదని.. శ్రీకాకుళం ఆధ్యాత్మికత, సంస్కృతి, చరిత్రకు ప్రతీక అని పేర్కొన్నారు. అరసవల్లిని ప్రముఖ ఆధ్యాత్మిక-పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో చీణూ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఓ ప్రణాళికా బద్దంగా అమలుచేసుకుంటూ వెళు న్నామని తెలిపారు. మంజూరైన నిధులతో భక్తులకు మెరుగైన మౌలిక వసతులు, పర్యాటక సౌకర్యాలు, కనెక్టివిటీతో పాటు అరసవల్లి సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సహకరించిన కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ శెకావత్ కు జిల్లా ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో అరసవల్లికి దేశవ్యాప్తంగా భక్తులు, పర్యాటకుల రాక మరింత పెరిగే అవకాశం ఉందని, అరసవల్లిని ప్రముఖ ఆధ్యాత్మిక-పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారంతో ముందుకు సాగుతామని ఆయన తెలిపారు. సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో, మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరుల సహకారంతో అరసవల్లి ఆలయం మరింత అభివృద్ధి చెందేందుకు స్పష్టమైన కర్యచారనతో వెళ్తున్నామని అన్నారు. ప్రధాన ఉత్సవం రథసప్తమి వేడుకలను ప్రతీ ఏటా ఘనంగా నిర్వహించామని, లక్షలాది మంది భక్తులు అరసవల్లిని సందర్శించారని తెలిపారు.

## ఒక్క మెతుకు ఆహారం వెనుక రైతు శ్రమ వర్ణితాతీతం



**- ఆహారాన్ని గౌరవించడం, ఆకలితో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత**

**- సామాజిక సేవకులు ఉర్లాం. శివతేజ పట్నాయక్**

నవతరం, శ్రీకాకుళం :అంతర్జాతీయ ఆహార నష్టం, వృథా అవగాహన దినోత్సవం సందర్భంగా ఆహారాన్ని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని సామాజిక, సంఘ సేవకులు, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ ఉర్లాం. శివతేజ పట్నాయక్ అన్నారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ప్రజలు నేటికీ ఆకలితో ఇబ్బందులు పడుతున్నారని, అదే సమయంలో అవసరానికి మించి ఆహారాన్ని తయారు చేసి వృథా చేయడం సరికాదన్నారు. ఒక్క మెతుకు ఆహారం వెనుక రైతు శ్రమ, నీరు, విద్యుత్, ప్రకృతి వనరులు ఉన్నాయని గుర్తించాలన్నారు. సామాజిక సేవలో భాగంగా మా స్నేహబృందంతో కలసి, వారు అందించిన సహకారంతో, నిరంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించేందుకు తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వివాహాలు, శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల్లో మిగిలిపోయే ఆహారాన్ని వృథా చేయకుండా అవసరమైన వారికి అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆహారాన్ని గౌరవించడం, ఆకలితో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, ఆహార నష్టం, వృథాపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని శివతేజ పట్నాయక్ పేర్కొన్నారు.

# సయోధ్య ద్వారానే కేసులకు శాశ్వత పరిష్కారం



నవతరం శ్రీకాకుళం, సెప్టెంబర్ 28: కోర్టులలో సుదీర్ఘకాలంగా పేరుకుపోయిన సివిల్, క్రిమినల్ కేసులకు మధ్యవర్తిత్వం ద్వారానే త్వరితగతిన శాశ్వత పరిష్కారం లభిస్తుందని శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. హరిబాబు స్పష్టం చేశారు. నల్సా, సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వ, సయోధ్య ప్రాజెక్టు కమిటీ ఆదేశాల మేరకు అక్టోబర్ 1 నుండి డిసెంబర్ 31 వరకు 90 రోజుల పాటు నిర్వహించనున్న 'మీడియేషన్ ఫర్ ది నేషన్ క్యాంపెయిన్ 3.0' ప్రత్యేక ప్రచారంపై మంగళవారం ఆయన అధ్యక్షతన న్యాయవాదులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో నిర్వహించిన మొదటి, రెండవ విడత క్యాంపెయిన్లలో జిల్లా మంచి ఫలితాలు సాధించిందని, ఈ మూడవ విడతలో అంతకుమించి గరిష్ట సంఖ్యలో కేసులను పరిష్కరించి శ్రీకాకుళం జిల్లాను ముందంజలో ఉంచాలని పిలుపునిచ్చారు. సయోధ్య విధానంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయంతో పాటు ధనం ఆదా అవుతుందని, చెల్లించిన కోర్టు ఫీజు కూడా తిరిగి వస్తుందని హరిబాబు వివరించారు. ఇరువర్గాల మధ్య శత్రుత్వం పోయి స్నేహపూర్వక సంబంధాలు కొనసాగుతాయని, ఇక్కడ కుదిరిన రాజీ తీర్పుకు కోర్టు డిక్రీతో సమానమైన చట్టబద్ధత ఉంటుందని తెలిపారు. వైవాహిక, కుటుంబ, ఆస్తి వివాదాలు, చెక్ బౌన్స్, మోటార్ ప్రమాద పరిహారం, కార్మిక, వాణిజ్య మరియు రాజీకి వీలైన క్రిమినల్ కేసులను ఈ 90 రోజుల క్యాంపెయిన్ ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 15100 టోల్ ఫ్రీ నంబరును సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లాలోని సీనియర్, ప్యానెల్, మధ్యవర్తిత్వ న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న కుటుంబానికి మానవతావాదుల చేయూత

### తండేల రాజారావుకు రూ.14 వేల విలువైన వైద్య సామగ్రి అందజేత

నవతరం, శ్రీకాకుళం రూరల్: ఆపదలో ఉన్న కుటుంబానికి పలువురు దాతలు అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. గార మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన తండేల రాజారావు పాము కాటుకు గురై కాలికి ఇన్ఫెక్షన్ ఏర్పడటంతో కొంతకాలంగా వైద్య చికిత్స పొందుతున్నారు. ప్రతిరోజూ అవసరమయ్యే డ్రెస్సింగ్ ప్యాడ్లు, మందులు, ఇతర వైద్య సామగ్రి కోసం కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న పలువురు దాతలు స్పందించారు. మల్లిమొగ్గల సంతోష్ కుమార్ సుమారు రూ.6,500 విలువైన డ్రెస్సింగ్ ప్యాడ్లు, మందులను అందజేశారు. సవారా లక్కయి రూ.2,500 విలువైన వైద్య సామగ్రిని అందించారు. దీర్ఘాసి అనిల్ కుమార్ సుమారు రూ.4,500 విలువైన డ్రెస్సింగ్ ప్యాడ్లు, మందులను స్పాన్సర్ చేశారు. సుసారపు శిరీష సుమారు రూ.500 విలువైన వైద్య సామగ్రిని అందించారు. ఈ నలుగురు దాతలు అందించిన సహాయంతో మొత్తం సుమారు రూ.14 వేల విలువైన వైద్య సామగ్రి తండేల రాజారావుకు అందింది. ఈ కార్యక్రమంలో నంది ఉమాశంకర్ పాల్గొన్నారు. ఆపదలో ఉన్న వారికి తమకు తోచిన విధంగా సహాయం అందించడం ద్వారా మానవత్వాన్ని చాటవచ్చని ఈ సేవా కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది. రాజారావు కుటుంబానికి అండగా నిలిచిన దాతలకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంది ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.



# 6.50 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యం

### బ్యాంకు గ్యారంటీ ఆధారంగానే మిల్లులకు లక్ష్యం నిర్దేశిస్తాం

### జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

నవతరం శ్రీకాకుళం, సెప్టెంబరు 29: రైస్ మిల్లర్లు సమర్పించే బ్యాంకు గ్యారంటీ ఆధారంగానే ధాన్యం సేకరణ లక్ష్యాలను నిర్దేశిస్తామని, ట్రక్ షీట్ జనరేషన్ 6 గంటల వ్యవధిని కచ్చితంగా పాటించి, అలాగే 24 గంటల్లోగా రైతు ఖాతాలో నగదు జమ అయ్యేలా చూడాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ స్పష్టం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాబోయే ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ (కేఎమ్ఎస్ 2026-27) ధాన్యం కొనుగోలు ముందస్తు ఏర్పాట్లపై అనుబంధ శాఖల అధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం సేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగడానికి వీల్లేదని, మిల్లర్లు గన్నీ బ్యాగుల సరఫరాలో ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వేగంగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గతం కంటే ఈసారి మద్దతు ధర క్వింటాలుకు రూ.72 పెరిగిందని, గ్రేడ్-ఎ రకానికి రూ.2,461, సాధారణ రకానికి రూ.2,441 లభిస్తుందని వెల్లడించారు. నవంబరు నాలుగో వారం నుంచి మార్కెట్‌కు ధాన్యం రాక మొదలవుతుందని తెలిపారు.

జిల్లాలో రాబోయే సీజన్‌కు సంబంధించి మొత్తం 4,24,229 ఎకరాల సాగు విస్తీర్ణంలో 3,82,541 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదైనట్లు, ఎకరాకు సగటున 22.40 క్వింటాళ్ల చొప్పున మొత్తం 9,51,246 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు అధికారులు తెలిపారు. స్థానిక వినియోగం పోను మార్కెట్‌కు వచ్చే 8,94,171 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ ద్వారా సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

జిల్లాలోని 274 రా రైస్ మిల్లులకు 6,50,000 మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యాన్ని నిర్దేశించగా, 1:1 నిష్పత్తి ప్రకారం రూ.1,600 కోట్లు, 50 శాతం నిష్పత్తి ప్రకారం రూ.800 కోట్ల బ్యాంకు గ్యారంటీ అవసరమవుతుందని తెలిపారు. సమీక్షలో అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండియా, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ పి.శ్రీనివాసరావు, ఆర్డీవోలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు బోయిన రమేష్, తంగుడు నాగేశ్వరరావు, చైతన్య ప్రభు, వ్యవసాయ, పౌరసరఫరాల శాఖల అధికారులు, ఎఫ్‌సీఐ, మార్క్‌ఫెడ్, మార్కెటింగ్ శాఖల ప్రతినిధులు, రవాణా, తూనికలు-కొలతల శాఖల అధికారులు, వివిధ రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్పీఓలు) పాల్గొన్నారు.



## సచివాలయ ఉద్యోగులపై

# నిర్బంధం ఆపాలి!

### సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్చలు జరపాలి

### శాంతియుత నిరసనలను అడ్డుకోవడం సరికాదు

### సస్పెండ్ చేసిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి: సీఐటీయూ

నవతరం ప్రతినిధి - నరసన్నపేట, సెప్టెంబరు 29: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఆందోళనలను అణచివేయడం సరికాదని, ఉద్యోగులపై నిర్బంధం, అరెస్టులు ఆపి తక్షణమే సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా ఉద్యోగులను అడ్డుకోవడం, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న వారిని బలవంతంగా అరెస్టు చేయడం వంటి చర్యలను తీవ్రంగా ఖండించింది.సీఐటీయూ నాయకుడు కాల నరసింహ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ.. తమ సమస్యల పరిష్కారం కోసం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పది రోజుల ముందుగానే సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారని తెలిపారు. అయినప్పటికీ చలో విజయవాడ కార్యక్రమానికి అనుమతి ఇవ్వకుండా అడ్డంకులు సృష్టించడం సరికాదన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఉద్యోగులను రోడ్డుపైకి ఈడ్చి పోలీసు వాహనాల్లోకి ఎక్కించి అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని పేర్కొన్నారు.ధర్నాలో పాల్గొన్న ఉద్యోగులను సస్పెండ్ చేస్తామని బెదిరిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి చర్యలతో సమస్యలు పరిష్కారం కావని, ప్రభుత్వంపై ఉద్యోగుల్లో వ్యతిరేకత మరింత పెరిగే అవకాశం ఉంటుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కక్షపూరిత వైఖరిని వీడి ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చలు జరపాలని సూచించారు. కొన్ని క్యాడర్లకు పదోన్నతుల సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడం స్వాగతించదగ్గ విషయమేనని, అయితే మిగిలిన సమస్యల పరిష్కారానికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను గత ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే వారు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని కాల నరసింహ అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సస్పెండ్ చేసిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సంఘాల నాయకులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో టి.శ్రీను, ఎన్.నాగరాజు, జి.సింహాచలం, బి.రాము తదితరులు పాల్గొన్నారు.




# టీటీడీ దర్శనం టికెట్లపై పారదర్శకత అవసరం

### 300 దర్శనం టికెట్ల బుకింగ్‌పై భక్తుల్లో అనుమానాలు: వి. రామమోహన్

### వెబ్‌సైట్, యాప్‌లో సాంకేతిక లోపాలను వెంటనే సరిచేయాలి

### సిఫార్సు లేఖల విధానాన్ని రద్దు చేసి సామాన్యులకు ప్రాధాన్యం ఇవ్వాలి

### సామాన్య భక్తులే వీఐపీలుగా భావించి సౌకర్యాలు కల్పించాలి



నవతరం ప్రతినిధి - తిరుమల, సెప్టెంబరు 29: భగవంతుడి ముందు అందరూ సమానమేనని, ఆలయాల్లో వీఐపీ సంస్కృతికి స్వస్తి పలికి సామాన్య భక్తులకు ప్రాధాన్యం కల్పించాలని మానవ హక్కులు, సామాజిక న్యాయం ఏపీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ వి. రామమోహన్ కోరారు. టీటీడీ ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల బుకింగ్‌లో భక్తులు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలపై పారదర్శకత అవసరమని ఆయన పేర్కొన్నారు.

టీటీడీ వెబ్‌సైట్, యాప్ ద్వారా దర్శనం టికెట్ల బుకింగ్ సమయంలో వర్చువల్ క్యూ, ఓటీపీ, స్లాట్ ఎంపిక, పేమెంట్ తదితర దశల్లో సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. గత మూడు నెలలుగా తాను టికెట్ల కోసం ప్రయత్నిస్తున్నానని, తనకు తెలిసిన పలువురు భక్తులు కూడా బుకింగ్ సమయంలో వివిధ సాంకేతిక సమస్యలు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. టికెట్లు విడుదలైన సమయంలో వెబ్‌సైట్, యాప్ సక్రమంగా పనిచేయకపోవడంపై టీటీడీ అధికారులు దృష్టి సారించాలని కోరారు.

**టికెట్ల బుకింగ్‌పై స్పష్టత ఇవ్వాలి**

ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల బుకింగ్‌లో ఎన్ని టికెట్లు విడుదల చేస్తున్నారు? ఎంత సమయంలో ఎన్ని టికెట్లు బుక్ అవుతున్నాయి? సాంకేతిక కారణాలతో ఎన్ని లావాదేవీలు విఫలమవుతున్నాయి? వంటి వివరాలను టీటీడీ అధికారికంగా వెల్లడించాలని రామమోహన్ కోరారు.

రైల్వే ఆన్‌లైన్ రిజర్వేషన్ వ్యవస్థలో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు టికెట్లు బుక్ చేసుకునే అవకాశం ఉన్నప్పుడు, టీటీడీ వద్ద పరిమిత సంఖ్యలో దర్శనం టికెట్ల బుకింగ్ సమయంలో పదేపదే సాంకేతిక సమస్యలు ఎందుకు ఎదురవుతున్నాయో పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. వెబ్‌సైట్, యాప్ పనితీరును సాంకేతిక నిపుణులతో సమగ్రంగా పరిశీలించి లోపాలను సరిచేయాలని సూచించారు.

**భక్తులకు సౌకర్యవంతమైన విధానం అవసరం**

ప్రతి సారి కుటుంబ సభ్యుల పేర్లు, ఆధార్ వివరాలను నమోదు చేయాల్సిన పరిస్థితి లేకుండా ముందుగానే వివరాలను నమోదు చేసుకునే సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. కుటుంబ సభ్యుల వివరాలను భద్రంగా సేవ్ చేసుకునే అవకాశం ఉంటే బుకింగ్ సమయంలో సమయం ఆదా అవుతుందని తెలిపారు. ఓటీపీ ఆలస్యం, పేమెంట్ విఫలం, స్లాట్ ఎంపిక కాకపోవడం, వర్చువల్ క్యూ వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు.

భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను టీటీడీ సాంకేతిక విభాగం పరిశీలించి బుకింగ్ ప్రక్రియను మరింత పారదర్శకంగా, సులభంగా మార్చాలని కోరారు. టికెట్ల బుకింగ్‌పై భక్తుల్లో వ్యక్తమవుతున్న అనుమానాలకు అధికారులు వాస్తవ గణాంకాలతో సమాధానం ఇవ్వాలని పేర్కొన్నారు.

**అక్రమాలపై దర్యాప్తు చేయాలి**

దర్శనం టికెట్ల బ్లాకింగ్, అక్రమ విక్రయాలకు సంబంధించి ఆధారాలు ఉంటే అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని రామమోహన్ కోరారు. అయితే ఆధారాలు లేకుండా ఎవరిపైనా ఆరోపణలు చేయకుండా, బుకింగ్ వ్యవస్థలో ఏమైనా లోపాలు ఉన్నాయా అనే విషయాన్ని సాంకేతికంగా పరిశీలించాలని సూచించారు.

**సామాన్య భక్తులకే ప్రాధాన్యం**

సిఫార్సు లేఖల విధానాన్ని పూర్తిగా రద్దు చేసి, వికలాంగులు, చిన్న పిల్లలతో వచ్చే కుటుంబాలు, వృద్ధులు తదితరులకు తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు. సర్వదర్శనానికి వచ్చే సామాన్య భక్తులే వీఐపీలుగా భావించి వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అన్నారు.

ఆలయాల్లో వీఐపీ సంస్కృతి, ప్రత్యేక దర్శనాలు, చెల్లింపు దర్శనాల విధానాలపై సమీక్ష అవసరమని పేర్కొన్నారు. భగవంతుడి ముందు భక్తులందరూ సమానమేననే భావనకు అనుగుణంగా దర్శన వ్యవస్థ ఉండాలని అన్నారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా సర్వదర్శన ఏర్పాట్లను మరింత మెరుగుపరచాలని కోరారు.

టీటీడీకి భక్తులే ప్రధాన ఆధారమని, వారి విశ్వాసం, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని సేవలను నిర్వహించాల్సిన బాధ్యత సంస్థపై ఉందన్నారు. వెబ్‌సైట్, యాప్‌లోని సాంకేతిక లోపాలను పూర్తిగా సరిచేసి దర్శనం టికెట్ల బుకింగ్ ప్రక్రియపై భక్తులకు నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని వి. రామమోహన్ కోరారు.

# పోలీసు వ్యవస్థలో నిజాయితీ, నిష్పక్షపాత సేవలు ముఖ్యం

### పోలీస్ పాసింగ్ పెరేడ్ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు



నవతరం శ్రీకాకుళం, సెప్టెంబర్ 29: నూతనంగా ఎంపికైన పోలీసు కానిస్టేబుళ్లు రాజ్యాంగానికి విధేయులుగా ఉంటూ నిజాయితీ, నిష్పక్షపాతంగా, ప్రజల హక్కులను గౌరవిస్తూ సమాజానికి అంకితభావంతో సేవలు అందించాలని రాష్ట్ర వ్యవసాయ, మత్స్య, సహకార శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా తండేవలసలోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో 142 మంది సివిల్ పోలీస్ కానిస్టేబుళ్ల (6వ బ్యాచ్) ప్రాథమిక శిక్షణ ముగింపు సందర్భంగా మంగళవారం ఘనంగా నిర్వహించిన పాసింగ్ అవుట్ పరేడ్ (దీక్షాంత్ పరేడ్) కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వందేమాతర గీతాలాపనతో ప్రారంభమైన ఈ వేడుకలో మంత్రి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కే.వి. మహేశ్వరరెడ్డిలతో కలిసి కవాతును పరిశీలించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన కానిస్టేబుళ్లు చట్టసమ్మతంగా విధులను నిర్వర్తిస్తామని ప్రమాణ స్వీకారం చేశారు.

పరేడ్ కమాండర్ చింతపల్లి నాగేశ్వరరావు నేతృత్వంలో ఐదు కంటింజెంట్లు నిర్వహించిన మార్చ్ పాస్ట్ ఎంతగానో ఆకట్టుకుంది. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కోల దుర్గారావు, కోట గౌతమ్, జరుగు ఆంజనేయులు, కోల కొత్త ప్రసాద్‌లతో పాటు శిక్షణ సిబ్బందికి మంత్రి ప్రశంసా పత్రాలు, ట్రోఫీలను అందజేశారు.

అనంతరం మంత్రి కింజరాపు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న మహిళా భద్రత (మహిళలపై నేరాల నియంత్రణ), మాదకద్రవ్యాల (డ్రగ్స్) నిరోధం, రహదారి భద్రత (రోడ్ సేఫ్టీ) అంశాలలో పోలీసులు క్రియాశీలక పాత్ర పోషించాలని నిర్దేశించారు. ఇటీవలి తుఫాను సమయాల్లో శ్రీకాకుళం జిల్లాలోని మూడు నదుల వరద ముంపు వేళల్లో బాధితుల తరలింపు, సహాయక చర్యల్లో పోలీస్ డిపార్ట్‌మెంట్ అందించిన సేవలు అద్భుతమని కొనియాడారు. శిక్షణ అనేది ఇక్కడితో ముగిసిపోదని, మారుతున్న నేరాల శైలికి అనుగుణంగా నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ యూనిఫాం గౌరవాన్ని, ప్రభుత్వం, దేశ కీర్తిని పెంచాలని ఆకాంక్షించారు.

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో ప్రజలతో నేరుగా నిరంతరం సంబంధం కలిగి ఉండేది కానిస్టేబుళ్లేనని, ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న మహిళా భద్రత, మాదకద్రవ్యాల నిరోధం, రహదారి భద్రత అంశాలలో క్రియాశీలక పాత్ర పోషించాలని నిర్దేశించారు. అనంతరం జిల్లా ఎస్పీ కే.వి. మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ... 9 నెలల పాటు సాగిన కఠిన శిక్షణను 142 మంది క్యాడెట్లు విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ఉన్నత విద్యార్హతలు కలిగిన ఈ బ్యాచ్ సభ్యులు సిసిటిఎన్ఎస్, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విచారణలో రాణించాలని, బాధితుల సమస్యలను ఓపికగా విని న్యాయం చేయాలని సూచించారు. ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత రిక్రూట్‌మెంట్ చేపట్టి, వసతుల కల్పనకు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కాగా, కృష్ణా, రాజమండ్రి జిల్లాలకు చెందిన ఈ 142 మంది క్యాడెట్లలో 17 మంది పీజీ, 100 మంది బి.టెక్, బి.ఎస్సీ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఉన్నత విద్యార్హతలు కలిగిన వారు ఉన్నారని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష, ఎన్.ఈశ్వరరావు, డి పి టి సి ప్రిన్సిపాల్ పి. శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు, కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# 175 మంది కళాశాల విద్యార్థులకు కంటిపరీక్షలు

జాతీయ అంధత్వ మరియు దృష్టిలోప నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఓ పరిమళ పర్యవేక్షణలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆప్తల్మిక్ అధికారి ఎం ఆర్ కే దాస్ 175 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి 15 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి వారికి ఉచిత కళ్లద్దాలు పంపిణీ కొరకు సిఫార్సు చేశారు. విద్యార్థులకు కంటి ఆరోగ్యం సంరక్షణ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్ భీమేశ్వరరావు,ఆరోగ్య పర్యవవేక్షకులు ఎస్ మోహన రావు, ఆరోగ్య కార్యకర్త కె. వెంకటరావు,ఆశ కార్యకర్త డి ధనలక్ష్మి ,జి విజయలక్ష్మి , అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.




# బీఈడీ కోర్సుకు అనుమతి మంజూరు



నవతరం శ్రీకాకుళం: జిల్లాలోని 2000–2021 సంవత్సరానికిగానూ స్పెషల్ డీఎస్సీ ద్వారా ఎంపికైన ఎస్సీ, ఎస్టీ అన్ ట్రైన్డ్ ఉపాధ్యాయులు, ఇప్పటికీ బీఈడీ కోర్సు పూర్తి చేయని వారి కోసం బీఈడీ కోర్సు పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతి కల్పించిందని ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పోతల దుర్గారావు, అధ్యక్షులు ఆవాల అప్పన్న తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబరు 15న ప్రభుత్వం బీఈడీ కోర్సు చేసుకునేందుకు అనుమతి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. 2026–27 విద్యా సంవత్సరంలో బీఈడీ కోర్సు పూర్తి చేయాలనుకునే ఎస్సీ, ఎస్టీ టీచర్స్ అక్టోబరు 30లోగా డీఈవోకు తమ ప్రతిపాదనలు పంపించాల్సి ఉంటుందన్నారు. కావున అభ్యర్థులు తక్షణమే తమ అసోసియేషన్‌ను ద్వారా 94405 50529 నెంబరుకు సంప్రదించినట్లైతే పూర్తి వివరాలు అందజేస్తామని పోతల దుర్గారావు తెలిపారు.

# 30న ఎస్ఎస్సి పరీక్షలు

శ్రీకాకుళం, సెప్టెంబర్ 29: ఈ నెల 30 నుండి అక్టోబరు 28 వరకు జరగనున్న స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ ప్రథమ విడత పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా పక్కా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ స్వప్నిల్ దిన్కర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. డెంటల్ కాలేజీ సర్వీస్ రోడ్డు, సిద్ధిపేట అండర్ పాస్ జంక్షన్ సమీపంలో ఉన్న సహస్ర డిజిటల్ సెంటర్‌ను జిల్లాలో ఏకైక పరీక్షా కేంద్రంగా కేటాయించినట్లు వెల్లడించారు. రోజుకు మూడు విడతల్లో జరిగే ఈ పరీక్షలకు సంబంధించి మొదటి విడత ఉదయం 10 నుండి 11 గంటల వరకు, రెండో విడత మధ్యాహ్నం 1:30 నుండి 2:30 గంటల వరకు, మూడో విడత సాయంత్రం 5 నుండి 6 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. నిర్దేశిత పరీక్షా సమయానికి గంటన్నర ముందుగా లోనికి అనుమతిస్తారు. అభ్యర్థులు నిర్దేశిత సమయానికి ముందే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

ఈ పరీక్షల జిల్లా నోడల్ అధికారిగా విద్యాశాఖ సహాయ కమిషనర్ జి.పి. చంద్రభూషణరావును నియమించినట్లు కేంద్రం వద్ద నలుగురు పోలీసులతో భద్రత కల్పించి, తోపులాటలు జరగకుండా చూడాలని ఎస్పీని కోరారు. పరీక్షలు జరిగే సమయాల్లో కేంద్రం చుట్టుపక్కల జిరాక్స్, నెట్ సెంటర్లను మూసివేసి భారతీయ నాగరిక్ సురక్ష సంహిత నిబంధనల ప్రకారం నిషేధాజ్ఞలు అమలు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. పరీక్షల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని విద్యుత్ శాఖాధికారులకు,స్త్ర అత్యవసర చికిత్స కోసం ప్రథమ చికిత్సా సదుపాయాలతో పాటు అంబులెన్స్ సిద్ధం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిని కలెక్టర్ ఆదేశించారు.

# హాఫ్ సారీ వేడుకలో పాల్గొన్న డాక్టర్ బొత్స సందీప్

## చిన్నారిని ఆశీర్వదించిన యువనేత

## వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బొత్స సందీప్

## ఘన స్వాగతం పలికిన గ్రామ నాయకులు, కుటుంబ సభ్యులు

నవతరం ప్రతినిధి – కోడూరు, సెప్టెంబరు 29: కోడూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన హాఫ్ సారీ వేడుకలో యువనేత డాక్టర్ బొత్స సందీప్ పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. కోడూరు మాజీ సర్పంచ్ గేదెల ఆదినారాయణ సోదరుడు గేదెల శ్రీను కుమార్తె హాఫ్ సారీ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బొత్స సందీప్ చిన్నారిని మనసారా ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా గ్రామ నాయకులు, కుటుంబ సభ్యులు డాక్టర్ బొత్స సందీప్‌కు ఘన స్వాగతం పలికారు. చిన్నారి భవిష్యత్తు సంతోషంగా, ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గేదెల ఆదినారాయణతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు గుడివాడ తమ్మినాయుడు, కడుముల రాంబాబు, యల్లాంటి పోలీస్ నాయుడు, గవిడి దాలి నాయుడు, గేదెల శంకర్, తండేల రామకృష్ణ, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పలు చోట్ల పాఠశాల యాజమాన్య కమిటీ లు ఎన్నిక. నవతరం టెక్కలి. నేడు టెక్కలి వంశధార కాలనీ ఎంపీపీ స్కూల్లో విద్యార్థులు తల్లిదండ్రులు మరియు ప్రధానోపాధ్యాయురాలు ఆధ్వర్యంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో ఏకగ్రీవంగా లక్ష్మీపురం పాపారావు చైర్మన్ గా బసవల్ల తేజేశ్వరి వైస్ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అలాగే శ్యామసుందరాపురం ఎంపీపీ స్కూల్లో చైర్మన్ గా లక్కోజ్ నవీన్ కుమార్ ను వైస్ చైర్మన్ గా సంపత్ రావు సతీష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దండు గోపాలపురం జిల్లా పరిషత్ హై స్కూల్ పరిధిలో 129 విద్యార్థుల తల్లిదండ్రుల పాల్గొని ఏకగ్రీవంగా ఎన్నికలు నిర్వహించి చైర్మన్ గా కొండాల భారతి వైస్ చైర్మన్ గా బాలక బాలరాజ్ ను ఎన్నుకొన్నారు. ఎన్నుకొన్న సభ్యులను ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులచే ప్రమాణస్వీకారం చేయించి వారందరినీ పలువురు అభినందించారు.






# పార్కింగ్ లేకుండా.. చలాన్లా?

*రైతు బజార్‌లో పార్కింగ్ స్థలాన్ని ఆక్రమించేశారా?*

*కంటైనర్లు, దుకాణాలతో పార్కింగ్‌కు దారేది?*

*లోపల స్థలం లేదు.. రోడ్డుపై పెడితే రాంగ్ పార్కింగ్ చలాన్లు!*

*పార్కింగ్ చూపకుండా ప్రజలకే జరిమానాలా?*

*రైతు బజార్‌కు వచ్చే వినియోగదారులకు తప్పని తిప్పలు*

*ఫిర్యాదు చేస్తే.. అది మా పరిధి కాదంటున్నారట!*

*ఖాళీ స్థలాలున్నా.. ప్రణాళిక లేక వాహనదారులకు ఇబ్బందులు*

*తక్షణమే పార్కింగ్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలి: బి.వి. రవిశంకర్*

శ్రీకాకుళం, సెప్టెంబర్ 29: పార్కింగ్ కోసం స్థలం ఉన్నా సదుపాయం కల్పించరు.. రోడ్డుపై వాహనం పెడితే చలాన్ మాత్రం వేస్తారు! శ్రీకాకుళం రైతు బజార్ వద్ద నెలకొన్న ఈ పరిస్థితిపై వాహనదారులు, వినియోగదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని జిల్లా ప్రజా సమస్యల వేదిక అధ్యక్షులు బి.వి. రవిశంకర్ పేర్కొన్నారు. పార్కింగ్ సమస్యను పరిష్కరించకుండా ప్రజలపై జరిమానాలు విధించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.

ప్రకటనలో రవిశంకర్ మాట్లాడుతూ.. రైతు బజార్‌లో వాహనాల పార్కింగ్ కోసం ఉద్దేశించిన ప్రదేశంలో కంటైనర్లు, దుకాణాలు ఏర్పాటు చేయడంతో వాహనాలు నిలిపేందుకు తగిన స్థలం లేకుండా పోయిందని ఆరోపించారు. దీంతో రైతు బజార్‌కు వచ్చే వినియోగదారులు తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్డుపైనే ద్విచక్ర వాహనాలు, కార్లు నిలిపే పరిస్థితి ఏర్పడిందన్నారు. అదే సమయంలో ట్రాఫిక్ పోలీసులు రాంగ్ పార్కింగ్ పేరుతో చలాన్లు విధిస్తున్నారని తెలిపారు.

“పార్కింగ్ సౌకర్యం కల్పించకుండా.. వాహనదారులపై చలాన్లు విధించడం ఏ న్యాయం?” అని ఆయన ప్రశ్నించారు.

రైతు బజార్‌కు నిత్యం వచ్చే ప్రజలకు కనీసం ద్విచక్ర వాహనాలు నిలిపేందుకు కూడా తగిన సౌకర్యం లేకపోవడం దారుణమన్నారు. సమస్యను పోలీసుల దృష్టికి తీసుకెళ్తే తమ పరిధిలోకి రాదని, మార్కెట్ అధికారులను సంప్రదించాలంటున్నారని.. అటు మార్కెట్ అధికారులు, ఇటు ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పరిష్కారం చూపాలని కోరారు. “ప్రజలకు పార్కింగ్ స్థలం చూపకుండా చలాన్లు వేయడం సాధారణ పౌరులకు శిక్ష విధించడమే” అని రిటైర్డ్ లెక్చరర్ కె. గోవిందరావు ప్రశ్నిస్తున్నారని రవిశంకర్ పేర్కొన్నారు.

రైతు బజార్ లోపల, ఫిష్ మార్కెట్ ప్రాంతంలో కొంత ఖాళీ స్థలం ఉన్నప్పటికీ దానిని సక్రమంగా వినియోగించకపోవడం వల్లే సమస్య మరింత తీవ్రమవుతోందన్నారు. అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి ద్విచక్ర వాహనాలు, కార్లకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పార్కింగ్ కోసం ఉద్దేశించిన స్థలంలో ఏర్పాటు చేసిన కంటైనర్లు, దుకాణాలకు సంబంధించిన అనుమతులు, వాటి వినియోగంపై అధికారులు సమీక్ష నిర్వహించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పార్కింగ్ సమస్య పరిష్కారం అయ్యే వరకు రైతు బజార్‌కు వచ్చే వాహనదారుల విషయంలో ట్రాఫిక్ పోలీసులు, మార్కెట్ అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

15 ఏళ్ల నాటి మార్కెట్.. ఇప్పటికైనా మార్పు ఏదీ?

సుమారు 15 సంవత్సరాల క్రితం నిర్మించిన రైతు బజార్ ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా లేదని రవిశంకర్ అన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న వినియోగదారులు, వాహనాల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని మార్కెట్‌ను సమగ్రంగా రీమోడల్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, వినియోగదారుల సౌకర్యాలపై పక్కా ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు.

“ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే రైతు బజార్‌కు వచ్చే వినియోగదారులు ఇబ్బందులు భరించలేక రావడమే తగ్గిపోయే పరిస్థితి ఉంటుంది. ప్రజలకు సౌకర్యం కల్పించాల్సిన మార్కెట్‌లో పార్కింగ్ సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలి. పార్కింగ్ కోసం ఉద్దేశించిన స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగిస్తుంటే దానిపై సమీక్ష జరిపి, ప్రజలకు పార్కింగ్ సదుపాయం అందుబాటులోకి తీసుకురావాలి” అని బి.వి. రవిశంకర్ డిమాండ్ చేశారు.



Printed by **SIRIGIRI VARADARAJU**, and published by SIRIGIRI VARADARAJU, on behelf of **SIRIGIRI VARADARAJU**, and printed at: Kranthi Publications, D.No.2-504/1 Aditya Nagar Colony, Arasavilli, Srikakulam, Srikakulam Dist. ANDHRA PRADESH STATE - 532 401, Published at : Kranthi Publications, D.No.2-504/1. Srikakulam Dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor: **SIRIGIRI VARADARAJU**, Email: navararamraju@gmail.com, Cell: **9959007255, 8340844777**